
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 7 డిసెంబరు 2025



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

తుంగభద్రతకు చర్యలు



తుంగభద్ర డ్యాం నూతన గేట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టీబీపీ బోర్డు అధికారులు ప్రత్యేక పూజలు చేసి పనులకు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా ముందు కాంట్రాక్ట్ సంస్థ పాత గేట్లు తొలగించే పనులు మొదలుపెట్టారు. రూ.44 కోట్లతో చేపట్టే పనులను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ అండ్ టూల్స్ సంస్థ చేపట్టింది. ఎట్టి పరిస్థితుల్లో 2026 జూన్ ఆఖరులోగా గేట్ల అమరిక పూర్తి చేసేందుకు బోర్డు ఇంజనీర్లు పక్కా ప్రణాళిక తయారు చేశారు. దీంతో జనవరి 11 వరకు సాగులో ఉన్న పంటలకు నీరు ఇచ్చి ఆ తరువాత అవసరాన్ని బట్టి తాగునీరు మాత్రమే ఇస్తామని తేల్చి చెప్పారు. గేట్ల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ వాటా నిధులు రూ.20 కోట్లు విడుదల చేసింది. కర్ణాటక వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంది.

- తుంగభద్ర గేట్ల ఏర్పాటుకు శ్రీకారం
- ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించిన టీబీపీ బోర్డు అధికారులు
- నూతనంగా 33 గేట్ల అమరిక
- ఏపీ వాటా రూ.20 కోట్లు విడుదల
- నిధులు విడుదల చేయని కర్ణాటక ప్రభుత్వం
- 2026 జూన్ ఆఖరి పనులు పూర్తయ్యేలా ప్లాన్

కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన నీటి ఆధారమైన తుంగభద్ర డ్యాం నూతన గేట్లు ఏర్పాటుకు టీబీపీ బోర్డు అధికారులు సన్నాహాలు చేపట్టారు. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్‌గేట్లు గేట్లు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై పలు అనుమానాలు తలెత్తాయి. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), డ్యాంను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఏకే బజాజ్ కమిటీ సిఫార్సుల మేరకు గేట్లు, ప్రాజెక్టు సామర్థ్యంపై టీబీపీ బోర్డు అధ్యయనం చేయిచింది. గేట్ల సామర్థ్యం నిర్ధారణ, రేడియోగ్రఫీ, ఎంపీటీ, అల్ట్రాసోనిక్, డీపీటీలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ అధ్యయనం చేసింది. 2024 ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మరో 32 గేట్ల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి గేటుకు 15 రకాల పరీక్షలు నిర్వహించారు. డ్యాం గేట్లన్నీ భారీగా తుప్పుపట్టి భారీ రంధ్రాలు ఏర్పడ్డాయని, కొన్ని ప్రదేశాల్లో రంధ్రాల వల్ల గేటు ప్లేట్లు బాగా ధ్వంసం అయ్యాయని, గుస్సెట్ ప్లేట్లు, దిగువ స్టిఫినర్లు, గేట్లకు సపోర్టుగా ఉండే గడ్డర్లు, సపోర్టింగ్ ప్లేట్లు కూడా బాగా తుప్పుపట్టి, చిల్లులు పడ్డాయని ఆ సంస్థ ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. గేట్ల సామర్థ్యం 45 ఏళ్లు కాగా, తుంగభద్ర గేట్లు 70 ఏళ్లు దాటడంతో మొత్తం గేట్లన్నీ మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంగా వివరించారు. ఆ నివేదిక ఆధారంగా డ్యాం 33 గేట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు టీబీపీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.



తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు అమర్చడంలో భాగంగా పాత గేటు తొలగించే పనుల్లో నిమగ్నమైన టెక్నికల్ సిబ్బంది

మిగతా 7వ పేజీలో

సమ సమాజ నిర్మాణమే అంబేడ్కర్ ఆశయం

- రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ నిర్మాణమే అంబేడ్కర్ ఆశయమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరికీ సమాన వైద్యం, విద్య, భావప్రకటన, సమన్యాయం పొందేందుకు రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. ఆయన చూపిన బాటలోనే కూటమి ప్రభుత్వం బడుగువర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలంటే రాజ్యాంగ విలువలకు అనుగుణంగా జీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీదేవి, నాగార్జున, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుమలత, మిద్దె హుసేని, రంగప్రసాద్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయండి

- రక్తదానంపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం నంద్యాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌లో నంద్యాల జిల్లా నూతన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత రాకుండా రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ యూనిట్లను ప్రతి కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ బృందాలను ఏర్పాటుచేసి లక్ష మంది విద్యార్థులను సభ్యులుగా నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై శిక్షణ ఇచ్చి రెడ్‌క్రాస్ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యుల సహకారంతో గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ డా.మమతారెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గసభ్యులు డా.నిశితారెడ్డి, డా.అరుణకుమారి, ఉస్మాన్ బాషా, నరసింహమూర్తి, రాధాకృష్ణ, యాకూబ్ పాల్గొన్నారు.

పోలీసులకు దీటుగా పని చేయాలి

హోంగార్డు వ్యవస్థాపక వేడుకల్లో ఎస్పీ

నంద్యాల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డులు తమ విధి నిర్వహణలో పోలీసులకు దీటుగా పని చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు 63వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసు శాఖలో నిస్వార్థ సేవతో పని చేసే వారందరికీ అభినందనలు తెలిపారు. శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీసులతో పోలిస్తే హోంగార్డులకు సౌకర్యాలు తక్కువ ఉన్నా.. కొన్ని సందర్భాల్లో వారి కంటే ఎక్కువ సేవలు చేస్తున్నారన్నారు. ఎల్లవేళలా వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 397 మంది హోంగార్డులు పని చేస్తున్నారని ట్రాఫిక్, క్రైం కంట్రోల్, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో దేవస్థాన భద్రత ఇలా అన్ని విభాగాల్లో పని చేస్తున్నారని అన్నారు. ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు బహుమతులు అందజేశారు. అలాగే బాగా చదువుకునే వారి పిల్లలకు స్కాలర్ షిప్ అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మందా జావళి, డీఎస్పీలు ప్రమోద్‌కుమార్, రామాంజినాయక్, శ్రీనివాసరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, సురేశ్‌బాబు, ఆర్ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్పీ

ప్రజల్లోకి సురక్ష యాప్ సేవలు

- సారా రహితమే లక్ష్యం కావాలి
- ఉమ్మడి జిల్లా సీఐలతో డీసీ సమీక్ష



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీదేవి

కర్నూలు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సురక్ష యాప్ సేవలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సీఐలతో అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధార్‌బాబులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ మద్యం కొనుగోలుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా, అక్రమ మద్యానికి అవకాశం లేకుండా సురక్షా యాప్‌ల సేవలను అందుబాటులోకి తీసికెళ్లాలని సూచించారు. జిల్లాను సారా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి స్టేషన్ పరిధిలో ప్రణాళికతో పని చేయాలన్నారు. కేసుల పురోగతి, జిల్లాలో అక్రమ మద్యం, సారాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు.






తుంగభద్ర తీరం

సాహిత్యం

అవధూత గాథ

- పద్య కావ్యంగా శ్రీసుబ్బగురు చరిత్ర
- మరుగునపడ్డ ఆధ్యాత్మికుడి జీవితాన్ని అక్షరబద్ధం చేసిన దోనెపూడి లక్ష్మీనారాయణ



నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనాదిగా రాయలసీమలో ఆధ్యాత్మిక సంప్రదాయం కొనసాగుతున్నది. ఎంతో మంది తాత్వికులు, యోగులు ఇక్కడ సంచరించారు. కాలజ్ఞానం రాసిన వీరబ్రహ్మేంద్ర స్వామి, ప్రజాకవిగా పేరొందిన వేమన లాంటి ప్రసిద్ధులే కాకుండా కాశిరెడ్డి నాయన వంటి అవధూతలు తిరిగిన ప్రాంతం ఇది. అలాంటి వారిలో ఒకరు శ్రీసుబ్బగురు అవధూత. ఆయన నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జూలేపల్లె గ్రామంలో జీవించారు. ఆయన జీవిత చరిత్రను కవి దోనేపూడి లక్ష్మీనారాయణ రాశారు.

శ్రీసుబ్బగురు అవధూత జీవితానికి ఏ చారిత్రక సాక్ష్యాలు లేవు. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచి, సజీవ సమాధి పొందిన సుబ్బ గురువు జీవితాన్ని ఒక కావ్యంగా రాశారు. జూలేపల్లి గ్రామ నివాసి, పురోహితుడు దోనేపూడి లక్ష్మీనారాయణ. సుబ్బగురు జీవితాన్ని ఒక కమనీయమైన పద్యకావ్యంగా రచించారు. 2007లో రచయిత మరణించారు. 2021లో ఆ గ్రంథం వెలుగులోకి వచ్చింది. పద్యకావ్యాలు రాయడం అరుదైన ఈ రోజుల్లో లక్ష్మీనారాయణ ఈ రచన చేశారు. ప్రౌఢ పద సౌష్టవంతో సుమారు 1000 పద్యాలతో 200 పేజీల ఈ గ్రంథం వెలువడింది. దోనెపూడి లక్ష్మీనారాయణ దీనిని వచన కావ్యంగా కూడా రాయాలని సంకల్పించారు. అది కూడా కొంత వరకే సాగింది. ఆతర్వాత ఆగిపోయింది. దానిని కూడా ప్రచురణకర్తలు ఈ పద్య కావ్యానికి అనుబంధంగా ఇచ్చారు.

- శ్రీసుబ్బయోగి జీవితం, మహిమలు కీలకాంశాలుగా ఈ కథా కావ్యం నడిచింది. చారిత్రక కథను, పౌరాణిక వాతావరణాన్ని మిళితం చేసి రాశారు. రుష్యాశ్రమ వాతావరణాన్ని, దేవలోక వృత్తాంతాల్ని పాఠకులకు సాక్షాత్కరింపచేశారు.
- ఉత్తర కథలో సుబ్బయోగి మరణానంతర కథను ఎక్కువ వాస్తవిక దృష్టితో విస్తరించారు. మఠ నిర్వహణ, శిథిలావస్థలో ఉన్న మఠ పునర్నిర్మాణం మొదలైన విషయాలతో కథ సాగించారు. ఈ కావ్యంలో ఉన్న కథ చాలా వరకు సూటిగా సాగింది. ఒకటి రెండు చోట్ల కవి ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్ పాటించారు. మొత్తం మీద కథను మనోహరంగా రాశారు.
- ఈ కథలోని నాయకుడు దివ్యతుల్యుడు. మహిమాన్వితుడు, ధీరశాంతుడు. సామాజిక స్పృహ ఉన్న యోగిపుంగవుడు. ఇందులోని ప్రధాన రసం అద్వైతాత్మకమైన భక్తి. అక్కడక్కడ అద్భుత రసం ప్రాధాన్యం వహించింది. ఇది భక్తికి తోడైంది. శృంగార వీర కరుణ రసాలు కూడా ఉన్నాయి. ఈ కావ్యం ఆనందాన్ని ప్రసాదించడమే కాక హితోపదేశాన్ని కూడ అందిస్తుంది. విజ్ఞానాన్ని వికసింపజేస్తుంది. లక్ష్మీనారాయణ అనేక సూక్తులను ఈ కథలో చెప్పారు. మానవులకు అభిమానం ముఖ్యమని, అతడు అరిషడ్వర్గాల్ని జయించాలని, సత్త్వగుణాన్ని అలవరచుకోవాలని, ధర్మాన్ని రక్షించాలని, మానవసేవ చేయాలని సజ్జన సాంగత్యాన్ని అవలంబించాలని, గురువాక్యాన్ని శిరసావహించాలని రాశారు.
- లక్ష్మీనారాయణగారి ఇల్లు అగ్నిప్రమాదానికి గురైనప్పుడు ఆయన కుటుంబసభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ఆయన పుస్తకాలన్నీ కాలిపోయాయి. కానీ ఆయన రాఇన శ్రీసుబ్బగురు చరిత్ర రాత ప్రతి మాత్రం మిగిలింది. అందువల్లే ఆ తర్వాత అది అచ్చయి పాఠకులను చేరుకోగలిగింది. ఈ పుస్తక ప్రతులు కావాల్సిన వారు సెల్‌నెంబర్-9491416696ను సంప్రదించవచ్చు.



-అన్నెం శ్రీనివాసరెడ్డి, నంద్యాల

టాలెంట్

మధురమైన కళ

- చిత్రలేఖనంలో రాణిస్తున్న మధుక్రిష్ణ
- ప్రముఖుల చిత్రాలు వేసి పలువురి మన్నన



సుద్దముక్కతో ఆకర్షణీయంగా వివిధ అకృతులు



బాదం ఆకుపై అంబేద్కర్ చిత్రం



సూక్ష్మ ఎర్రకోటపై జాతీయ పతాకం నమూన



కోడి గుడ్డుపై శ్రీనివాసరామానుజన్ చిత్రం

ప్యాపిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధుక్రిష్ణ సూక్ష్మ చిత్రలేఖన కళాకారుడు. కేవలం సుద్దముక్కలతో అబ్బురపరిచే కళారూపాలు చిత్రిస్తున్నాడు. ఆయనది మండలంలోని వెంగళాంపల్లి గ్రామం. చిన్నతనంలోనే చిత్రలేఖనంపై మక్కువ పెంచుకున్న మధుక్రిష్ణ ప్రాథమిక విద్య చదువుతున్న రోజుల్లోనే చిన్న చిన్న చిత్రాలు వేసి ఉపాధ్యాయుల ప్రశంసలు పొందాడు. ఉన్నత విద్యలోకి వెళ్లాక కూడా తన అభిరుచిని వదులుకోలేదు. మరింతగా చిత్ర లేఖనంపై పట్టు సాధించాడు.

మధుక్రిష్ణ డిగ్రీ, టీటీసీ పూర్తి చేశాడు. సుద్దముక్కలతో తనదైన శైలిలో సూక్ష్మరూప చిత్రాలు గీస్తూ గుర్తింపు సంపాదించాడు. ప్రముఖుల జయంతి సందర్భంగా వారి చిత్రాలను సూక్ష్మరూపంలో తీర్చిదిద్దుతున్నాడు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని బాదం ఆకుపై వారి చిత్రాలను గీచి ప్రశంసలు అందుకున్నాడు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రాలను కోడుగుడ్డుపై ఆకట్టుకొనేలా చిత్రీకరించాడు.

సుద్దముక్కతో అద్భుత ఆకృతులు

సుద్దముక్కలతో మధుక్రిష్ణ సూక్ష్మ చిత్రాలను గీచడం విశేషం. నాసా తయారు చేసిన చంద్రయాన్ విజయవంతం కావడంతో ఆ ఏడాది సుద్దముక్కతో చంద్రయాన్ ఆకృతిని గీచాడు. అలాగే ఆగస్టు 15ను పురస్కరించుకొని ఎర్రకోటపై జాతీయ జెండాను చిత్రీకరించాడు. సూక్ష్మ వరల్డ్ కప్, బుల్లి కెమేరాతో పాటు వివిధ ఆకృతులను సుద్దముక్కలతో ఆకర్షణీయం చిత్రీకరించడం ఆయన ప్రతిభకు నిదర్శనం.

రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం: మధుక్రిష్ణ



చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి ఎక్కువగా ఉండేది. నేను గీసిన చిత్రాలను ఉపాధ్యాయులు కూడ మెచ్చుకొనేవారు. దీంతో చిత్రలేఖనంపై మరింత ఆసక్తి పెరిగింది. దీంతో ఇంటర్, డిగ్రీ, టీటీసీ చదివే సమయంలో కూడ చిత్రాలను వేశాను. ఏనాటికైనా రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం.

అలరించిన 'సైరా నరసింహారెడ్డి' నాటకం



నరసింహారెడ్డి నాటకంలోని ఓ సన్నివేశం

గడివేముల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డి నాయన స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గడివేముల మండలంలోని గని గ్రామంలో సైరా నరసింహారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం అలరించింది. టీజీవీ కళాక్షేత్రం, బుడ్డా వెంగళరెడ్డి కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన ఈ నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత వృత్తాంతంలోని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ నాటకంలో కళాకారులు తమదైన శైలిలో నటనాచాతుర్యాన్ని ప్రదర్శించారు. కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, పి.రాజారత్నం, గజల్ మహ్మద్ మియ, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, ఆర్.శ్యామేలు, పి.భాస్కర్, నవీన్ చౌదరి, రేణుక, హసీనా తదితరులు విభిన్న పాత్రల్లో అలరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్లు కె.వి.రమణ, కదిరి రమేష్ మాట్లాడుతూ దివంగత పల్లేటి కులశేఖర్ రచన, కళారత్న పత్తి ఓబులయ్య దర్శకత్వంలో సైసైరా నరసింహారెడ్డి నాటకానికి ఎన్నో అవార్డులు, ప్రశంసలు వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా గని గ్రామంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నదానం చేపట్టారు. సైరా నాటక ప్రదర్శనలో సంగీతం మాస్టర్లు బండారు బలరాం, రామలింగయ్య, మహేశ్, నంద్యాల రామబ్రహ్మం మేకప్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధానికి సహకరించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టేందుకు విద్యార్థులందరూ సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. శనివారం జి. పుల్లారెడ్డి డెంటల్ కాలేజీలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే.. చట్టప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయని, జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులు లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెం.15100 కాల్ చేస్తే వారికి తక్షణ న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీలు రాఘవరెడ్డి, ఏకాంబరరెడ్డి, డైరెక్టర్ వై. మురళిధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

సంప్రదాయ క్రీడల్లో ఎద్దుల పోటీలకు ప్రాముఖ్యత

- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి బీ.సీ జనార్దన్ రెడ్డి

సంజామల, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): తెలుగువారి సంప్రదాయ క్రీడల్లో ఎద్దుల పోటీలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ముక్కమల్ల టీడీపీ నాయకులు మూసాని చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి న్యూక్యాటగిరి విభాగానికి చెందిన ఎద్దుల పోటీలను మంత్రి ప్రారంభించారు. ఆయనకు కమిటీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకత చోటుచేసుకున్నప్పటికీ ప్రస్తుత సమాజంలో ఎద్దులను పోషించడం కష్టతరమన్నారు. అయినప్పటికీ రైతులు వ్యయప్రయాసాలు వెచ్చించి ఎద్దులను పోషిస్తూ పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. అనగనూరుకి చెందిన సాయిగణేష్ శర్మ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వారైనా 10 గ్రామాలకు పౌరోహితం చేస్తూ పోటీ ఎద్దులను పోషించడం వారికి సారథ్యం వహించడం గర్వించదగ్గ విషయమని శర్మను అభినందించి సత్కరించారు. ప్రథమ విజేతకు రూ. 60వేలు నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. టీడీపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల మద్దిలేటిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఆకుమల్ల సొసైటీ చైర్మన్ మోహన్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, మల్కి హుసేన్, మద్దిలేటి, తిమ్మయ్య, రామగోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా ప్రకాశం జిల్లా ఎద్దులు

రాష్ట్ర నలుమూలల నుంచి 19 జతల ఎద్దులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో ప్రకాశం జిల్లా మద్దిరాళ్ల ముపాలకి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. గుంటూరు జిల్లా కొండబాల వారి పాలెంకి చెందిన జి.పి చౌదరి ఎద్దులు, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. నాల్గవస్థానంలో కడప జిల్లా దువ్వూరు మండలం గొల్లపల్లికి చెందిన చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దులు, ఐదో స్థానంలో నంద్యాల జిల్లా పిన్నాపురానికి నికి చెందిన వెంకటక్రిష్ణ ఎద్దులు దక్కించుకున్నాయి. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులను కమిటీ వారు అందజేశారు.

క్రీడాకారులు దేశం గర్వించేలా ఎదగాలి

- అర్జున అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ ఆటగాడు చేతన్ ఆనంద్
- ఆర్జీఎంలో ఇండోర్ స్టేడియం ప్రారంభం



ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న అర్జున అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్

పాణ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశం గర్వించేలా ఎదగాలని అర్జున అవార్డు గ్రహీత, భారత బ్యాడ్మింటన్ ఆటగాడు చేతన్ ఆనంద్ అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన బాల్‌బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రామాణికాలతో ఇండోర్ స్టేడియం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు తయారవుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని కోరారు. క్రీడలు మానసికంగానే కాక ఆర్థికంగా, పేరుప్రతిష్టలకు దోహదపడతాయన్నారు. కళాశాల ఎండీ శివరాం మాట్లాడుతూ విద్యార్థుల క్రీడాభ్యున్నతికి మరింత కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులకు క్రీడా రంగంలో సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించే దిశగా కళాశాల నిత్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు జయచంద్రప్రసాద్, మధుసూదన్ చెట్టి, సుబ్రహ్మణ్యం, పీడీ వెంకటేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరాణికంలో రాణిస్తున్న అటవీశాఖ అధికారి

కళ



దుర్యోధనుడిగా శ్రీనివాసులు నాయుడు

రుద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య విద్యతో పౌరాణిక పాత్రలో ఫారెస్టు డిప్యూటీ రేంజర్ శ్రీనివాసులు రాణిస్తున్నారు. మయసభలో దుర్యోధనుడిగా, చింతామణిలో భవానీగా, సత్యహరిశ్చంద్రుడిగా పాత్రలో ఆయన ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఓ వైపు అటవీశాఖలో ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తూనే మరో వైపు ప్రాచీన కళల్లో ఒకటైన పౌరాణిక నాటక రంగంలో తన నటనా వైభవాన్ని చాటిచెబుతున్నారు. కోసిగి మండలం కేంద్రంలో వెంకటరాముడు, మల్లమ్మ దంపతులకు జన్మించిన ఆయన విద్యాభ్యాసం తర్వాత 2008లో ఫారెస్టు డిప్యూటీ ఆఫీసరుగా విధుల్లోకి చేరారు. నంద్యాల డివిజన్‌లోని బండి ఆత్మకూరు ఫారెస్టు రేంజ్‌లో జీఈసాలెం బీట్ ఆఫీసరుగా విధుల్లో చేరారు. రుద్రవరం, నంద్యాలలో పనిచేశారు. ప్రస్తుతం ముద్దనూరు రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పౌరాణిక నాటకాలను గురువు లేకుండా ఏకలవ్య విద్యతో పౌరాణిక పద్యాలు నేర్చుకున్నారు. మయసభ దుర్యోధనునిగా, భవానీపాత్రలో, సత్యహరిశ్చంద్ర పాత్రలో నంద్యాల, ఆళ్లగడ్డ, కర్నూలు, అహోబిళం, రుద్రవరం ప్రాంతాల్లో నిర్వహించిన 50 పౌరాణిక నాటకాల్లో మయసభ దుర్యోధనునిగా మరో 10 భవానీ పాత్రల్లో తాను ప్రదర్శనలు ఇచ్చారు.



భవానీ పాత్రలో పద్యం పాడుతున్న దృశ్యం

పౌరాణికం అంటే ఇష్టంతోనే...



పౌరాణికం అంటే ఇష్టంతో విద్యార్థి దశలోనే పద్యాలు నేర్చుకున్నా. పాఠశాల స్థాయిలోనే పౌరాణిక పద్యాలు పాడుతూ వచ్చా. అప్పటి నుంచి నేటి వరకు గురువు లేకుండానే పద్యాలు నేర్చుకున్నా. మయసభ దుర్యోధనుడిగా, భవానీ పాత్రలో, హరిశ్చంద్రుని పాత్రలు వేస్తున్నా. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది.

- శ్రీనివాసులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి

కోవెలకుంట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో శనివారం కోవెలకుంట్ల ఏపీఎం శేఖర్ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో కృష్ణమూర్తి, శ్రీనివాసులు పాల్గొని మహిళలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథులుగా వెలుగు పీడీ శ్రీధర్ రెడ్డి, డీపీఎం హనుమాన్ నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 16మండలాలను ఆదర్శ మహిళా సమాఖ్య మండలాలలుగా ఎంపిక చేశారన్నారు. ఆ మండలాల్లో మహిళలను చైతన్యపరిచేందుకు మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో మహిళా సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో అనే ప్రణాళికను తయారుచేసి మహిళలను చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీసీలు గోపాల్, రవి, క్రిష్ణమూర్తి, నిర్మల, అకౌంటెంట్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్

- బీసీలకు ప్రాధాన్యమిచ్చిన టీడీపీ
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అరాచకాలను అరికట్టేందుకు పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా చరిత్రలో నిలిచిపోయారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యమిచ్చిన తెలుగుదేశం పార్టీ ఎంతోమంది బడుగులను చట్టసభలకు పంపిందన్నారు. శనివారం తుగ్గలి మండలంలోని రాతన గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ, మనుమరాలు మోహనరూప హాజరయ్యారు. ముందుగా వారు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి గజమాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ 1980లో డబ్బున్న వారిదే రాజకీయంగా ఉండేదన్నారు. అలాంటిది ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ వల్ల అన్ని వర్గాల ప్రజలు, పేదలు కూడా రాజకీయంగా ఎదిగి ఎమ్మెల్యే ఎంపీలు, మంత్రులు అయ్యారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీఆర్ పేదలతో నేరుగా కలిసి మాట్లాడేవారన్నారు.



మోహన కృష్ణ, వైవీఎస్ చౌదరితో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

నందమూరి మోహనకృష్ణ మాట్లాడుతూ తెలుగుజాతి పట్ల అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చూపించిన నిర్లక్ష్యం, అవమానాన్ని చూసి ఎన్టీఆర్ తట్టుకోలేకపోయారన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు, బడుగులను రాజకీయంగా తీర్చిదిద్దేందుకు తన తండ్రి ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్, కేఈ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఎన్టీఆర్ కర్నూలు పర్యటనకు వచ్చి తమ తాత కేఈ మాదన్నను టీడీపీలోకి ఆహ్వానించి టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. అలాగే తన తండ్రి కేఈ కృష్ణమూర్తి, తనకు తెలుగుదేశం పార్టీ ఎంతో గుర్తింపునిచ్చిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి నీరు దక్కుతోందంటే ఎన్టీఆర్ పుణ్యమే అన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించి ఎన్టీఆర్ కలుల నిజం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత వైవీఎస్ చౌదరి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, విగ్రహదాత పారా రామచంద్రప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, బత్తిన వెంకట్రాముడు, కృష్ణమూర్తి చౌదరి, తిరుపాల్ నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి,



రాతనలో జెండా ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

పురుషోత్తం చౌదరి, సంజీవ, రవి, రాజన్న యాదవ్, శ్రీనివాసులు, కోటేష్ చౌదరి, దేవేంద్ర, కేఈ రుద్ర పణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయలసీమ అంటే ప్రత్యేక అభిమానం

టీడీపీని స్థాపించి మొట్టమొదటి ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో మా తాత ఎన్టీఆర్ పోటీ చేసి గెలుపొందారు. వాటిలో అనంతపురం జిల్లా హిందూపూరం నియోజకవర్గం మాత్రమే ఎంచుకున్నారు. అలాగే మా పెద్దనాన్న హరికృష్ణ హిందూపురం నియోజకవర్గం నుంచే పోటీ చేసి గెలుపొందారు. మూడు పర్యాయాలుగా మా బాబాయ్ బాలకృష్ణ హిందూపురం నుంచే పోటీ చేసి గెలుపొందారు. రాయలసీమపై మా కుటుంబానికి ఎనలేని ప్రేమ ఉంది. తాత ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఎక్కడ చేపట్టినా మా కుటుంబం నుంచి ఎవరో ఒకరం కచ్చితంగా హాజరవుతాం.

- మోహన రూప, ఎన్టీఆర్ మనుమరాలు



గేట్ల ఏర్పాటు కోసం పూజలు చేసి ప్రారంభిస్తున్న బోర్డు అధికారులు



డ్యాంకు సమీపంలో గేట్ల తయారీ



ఫ్యాబ్రికేషన్ చేసిన గేట్లను డ్యాం వద్దకు తరలిస్తున్న వాహనం

తుంగభద్రతకు చర్యలు

(5వ పేజీ తరువాయి)

● పాత గేట్ల తొలగింపు పనులు

తుంగభద్ర డ్యాం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు చేసేందుకు రూ.44 కోట్లతో టెండర్లు పిలిచారు. గుజరాత్‌కు చెందిన 'హర్డ్‌వేర్ టూల్స్' సంస్థ టెండరు దక్కించుకుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై నుంచి జలాశయంలోకి వరద మొదలు కావడంతో ఆ సమయంలో గేట్లు ఏర్పాటు పనులు మొదలు పెట్టలేదు. అయితే గేట్ల తయారి (ఫ్యాబ్రికేషన్) పనులు మాత్రం కాంట్రాక్ట్ సంస్థ చేపట్టింది. ఇప్పటికే 15 గేట్లు తయారు చేశారు. వీటిని అమర్చాలంటే పాత గేట్లు తొలగించాల్సి ఉంది. ఆ పనులను శుక్రవారం మొదలు పెట్టారు. బోర్డు సెక్రెటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్ఈ నారాయణ నాయక్, బోర్డు కర్ణాటక సభ్యుడు కృష్ణమూర్తి కులకర్ణి, మునిరాబాద్ ఎస్ఈ, విజయనగర (హోస్పెట్) జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ సహా ఏపీ, కర్ణాటక రైతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. తుంగభద్రమ్మకు జలహారతి ఇచ్చారు. తరువాత గేట్ల తయారి, అమరిక టెక్నికల్ సిబ్బంది పాత గేట్లను తొలగించే పనులు మొదలు పెట్టారు. సోమవారం నుంచి దాదాపు 80 మందితో పనులు వేగంగా చేపడుతామని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జూన్ ఆఖరులోగా కొత్త గేట్లు ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు.

● జపాన్ నుంచి బేరింగులు దిగుమతి

టీబీపీ డ్యాంకు ఏర్పాటు చేసే గేట్లకు బేరింగులు ఎంతో కీలకం. మన దేశంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన బేరింగ్స్ అందుబాటులో లేకపోవడంతో జర్మని నుంచి దిగుమతి చేసుకోవాలని అనుకున్నారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఉండడంతో ఒక్కో గేటుకు 12 చొప్పున 396 బేరింగులు దిగుమతి చేసుకున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఇందుకోసం రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. గేట్లు ఎత్తడం, దించడంతో బేరింగులు అత్యంత కీలకమని, అందుకే జపాన్ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు పేర్కొన్నారు.

● నిధులు ఇవ్వని కర్ణాటక

డ్యాం నిర్వహణ, మరమ్మతులు.. వంటి పనులకు ఏపీ ప్రభుత్వం 55 శాతం, కర్ణాటక ప్రభుత్వం 45 శాతం వాటా నిధులు చెల్లించాల్సి ఉంటుంది. 33 గేట్లలో ఏపీ నిర్వహణలోకి 15 గేట్లు, కర్ణాటక నిర్వహణలోకి 18 గేట్లు వస్తాయి. మొత్తం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు కోసం రూ.44 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో ఏపీ వాటా నిధులు రూ.20 కోట్లు ఇప్పటికే టీబీపీ బోర్డు విడుదల చేసినట్లు ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు వివరించారు. అయితే ఈ నిధుల విషయంపై కర్ణాటకకు లేఖ రాశామని, రెండు మూడు రోజుల్లో ఆ రాష్ట్రం కూడా వాటా నిధులు విడుదల చేస్తుందని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.



విషగుళికలు మింగి వ్యక్తి బలవన్మరణం



శరత్‌కుమార్(ఫైల్)

కొలిమిగుండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విష గుళికలు మింగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీలో చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. అనంతపురం జిల్లా యాడికి మండలం నగరూరుకు చెందిన శరత్‌కుమార్(25) శుక్రవారం రాత్రి కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తనమిత్రుడు హరీశ్ గదికి వచ్చాడు. హరీశ్ అల్ట్రాటెక్ పరిశ్రమలో పనిచేస్తూ ఈకాలనీలో నివాసం ఉంటున్నాడు. కొన్ని సమస్యలు ఉన్నాయని, రెండు రోజులు ఇక్కడే ఉంటానని అతడు మిత్రుడితో చెప్పాడు. శనివారం హరీశ్ డ్యూటీకి వెళ్లిపోయాడు. కాసేపటికే రూమ్‌లోఉన్న శరత్‌కుమార్ తాను విషగుళికలు మింగానని హరీశ్‌కు వాయిస్ మేసేజ్ చేశాడు. అతడు ఇంటికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న శరత్‌ను తాడిపత్రికి, అక్కడి నుంచి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శరత్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి నెల రోజుల క్రితమే బళ్లారి జిల్లా సుగ్నీవ్ కొట్టాల గ్రామానికి చెందిన సుష్మితతో వివాహమైంది. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రొటేషన్ పద్ధతిలో హెచ్‌వోడీ పోస్టులు ఇవ్వాలి



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీజీడీఏ అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం రొటేషన్ పద్ధతిలో ప్రొఫెసర్లకు హెచ్‌వోడీ పోస్టులను కేటాయించాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.పి. బ్రహ్మజీ మాస్టర్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం సమర్పించారు. శనివారం వైస్ ప్రెసిడెంటు డా. రామశివనాయక్, అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్‌తో కలిసి ఆయన ప్రిన్సిపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా డా. బ్రహ్మజీ మాస్టర్ మాట్లాడుతూ ఎన్ఎంసీ ప్రకారం హెచ్‌వోడీ పోస్టులను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఈ విధానంలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అందరికీ అవకాశం కల్పిస్తున్నారన్నారు. సీనియారిటీ పేరుతో కొందరు ఏళ్ల తరబడి హెచ్‌వోడీలుగా కొనసాగుతున్నారని అన్నారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కే. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునాటి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోలేదనీ, అన్ని రకాల పంట ఉత్పత్తుల ధరలు పతనమై రైతులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కరువు కాటకాల్లో తుఫాను సందర్భాల్లో నష్టపోయిన పంటలకు స్వచ్ఛంద బీమా పథకం ద్వారా ఆదుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

జిల్లాలో వంద రోజుల ప్రణాళిక

● డీఈవో శామ్యూల్ పాల్



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలపై ఉపాధ్యాయులు యుద్ధం చేయాల్సిందేనని ఎన్ని సంక్లిష్టతలు ఉన్నా అధిగమించి విద్యార్థులను ఉత్తీర్ణులు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం కోడుమూరు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి స్టడీ అవర్స్ తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సులభతరం చేయాలని, మానసికమైన ఒత్తిడిని దూరం చేసి పాఠ్యాంశాలను అవగాహన కల్పించడంలో సఫలీకృతులు కావాలన్నారు. మనకిప్పుడు యుద్ధ వాతావరణం నెలకొని ఉందని అందరం అధిగమించాల్సిందేనని హితువు పలికారు. ఉపాధ్యాయులతోనూ, విద్యార్థులతోనూ విడివిడిగా సమావేశమై సందేహాలను నివృత్తి చేశారు.

నేడు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ పరీక్ష

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి 1 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈపరీక్షకు మొత్తం 4,120 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లలో మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పరీక్షకు సంబంధించి 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్టుమెంటు ఆఫీసర్లు, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆఫీసర్లను నియమించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

● ఐదుగురికి గాయాలు

● దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఆటో ప్రమాదం



నాగేంద్రమ్మ (ఫైల్)



హనుమక్క (ఫైల్)

ప్యాపిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలేబాదు గ్రామం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని పోలీసులు 108 అంబులెన్స్‌లో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలంలోని రామ క్రిష్ణాపురం గ్రామానికి చెందిన 9 మంది మహిళలు ఈ నెల 4న ఆటోలో కడప జిల్లా పోరుమామిళ్ల దగ్గరలోని జ్యోతి నందుల కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి వెళ్లారు. ఆ రోజు స్వామిని దర్శించుకొని అక్కడే నిద్రించారు. 5న అవుకు మండలంలోని సీతారాంపురంలో నిర్వహిస్తున్న కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలలో పాల్గొన్నారు. ఆ రాత్రి మహిళలంతా సొంత ఊరికి బయలు దేరారు. మార్గమధ్యంలోని అలేబాదు గ్రామం సమీపంలోని వినాయకుడి గుడి దగ్గర మలుపులో ఆటో అదుపు కాక బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హనుమక్క(66), నాగేంద్రమ్మ(58) మృతి చెందగా కళావతి, అయ్యమ్మ, సోమక్క, మద్దమ్మ, లక్ష్మమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. రాచెర్ల ఎస్ఐ రమేష్ బాబు తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 అంబులెన్స్ డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న సోమక్క, అయ్యమ్మను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీ పనులకు వస్తూ.. అనంత లోకాలకు..

● బైకును ఢీకొన్న ట్రాక్టర్.. మహిళ దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు



సరస్వతి (ఫైల్)



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతురాలి బంధువులు

ఆదోని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూలీ పనులకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా కూలీ దుర్మరణం చెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని కపటి శివారులో శనివారం చోటుచేసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. వివరాలు.. పెద్దకడుబూరు మండలం తారాపురానికి చెందిన దంపతులు గిరిస్వామి, సరస్వతీ(25). వారు కూలీ పనుల నిమిత్తం ప్రతి రోజు బైక్‌పై ఆదోనికి వస్తారు. శనివారం భార్యాభర్తలతో పాటు గిరిస్వామి తండ్రి ఉరుకుందప్ప కూడా బైక్‌పై బయలుదేరారు. వీరి వాహనం ఆదోని మండలం కపటి శివారుల్లోకి రాగానే గరుసును తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. అందరూ కిందపడిపోగా. సరస్వతీపై నుంచి ట్రాక్టర్ దూసుకెళ్లింది. రెండు కాళ్లు విరిగి, తల పగిలి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గిరిస్వామి, ఉరుకుందప్ప గాయపడగా వారిని స్థానికులు ఆదోని ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. తల్లిని కోల్పోయిన పిల్లలను ఎవరు చూసుకోవాలంటూ మృతురాలి బంధువులు రోధిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్చురీ వద్ద పోలీసులతో..

గ్రామానికి చెందిన ఓ సీనియర్ టీడీపీ నాయకుడు గరుసు దందాకు పాల్పడుతున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ అశోక్ కూడా మైనరేనని, అతనికి లైసెన్స్ కూడా లేదు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని వచ్చేంతవరకు పోస్టుమార్టం చేయించేది లేదని మృతురాలి బంధువులు మార్చురీ వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ టీడీపీ నాయకుడు కూటమికి చెందిన మహిళా నాయకురాలికి అనుచరుడు కావడంతో ఆమె ఎలాగైనా పంచాయితీ చేసి ఆర్థికసాయం చేస్తామని అధికారులను వేడుకొంది. మృతురాలి బంధువులకు రూ.6లక్షలు ఇవ్వడానికి గరుసు దందాదారులు ముందుకొచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

స్క్రబ్ టైఫస్‌పై భయం వద్దు: కలెక్టర్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి మనిషి నుంచి మనిషికి వ్యాపించదని, దీనిపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ సిరి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కలెక్టర్ స్క్రబ్‌టైఫస్ వ్యాధిపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి. విజయానందబాబు, మెడిసిన్ హెచ్‌వోడీ డా.డి.శ్రీరాములుతో కలిసి సమీక్ష నిర్వహించారు. కర్నూలు జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ కేసులు ఇప్పటివరకు 44 పాజిటివ్ కేసులు వచ్చాయని, ఇందులో 39మంది రోగులు డిశ్చార్జ్ చేశామని, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 5 మంది చికిత్స పొందుతున్నారన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అప్రమత్తంగా ఉంటే సరిపోతుందన్నారు. రైతులు పొలాల్లో, పొదల్లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని, పూర్తిగా ఒంటిని కప్పి ఫుల్‌షర్టులు, వ్యవసాయంలో ఫుల్ రబ్బరు బూట్లు, ప్యాంట్లు ధరించాలని సూచించారు.జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. ఉమాదేవి, ఫల్మనాలజీ హెచ్‌వోడీ డా.శ్రీకాంత్, పాల్గొన్నారు.

కార్పొరేటర్ హల్‌చల్

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఓ కార్పొరేటర్ ట్రాఫిక్ పోలీసులపై హల్‌చల్ చేశాడు. శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు గౌరి గోపాల్ హస్పిటల్ సమీపంలో హెల్మెట్‌ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. అటుగా వెళ్తున్న కార్పొరేటర్‌ను కూడా ట్రాఫిక్ పోలీసులు ఆపారు. తను కార్పొరేటర్‌ను అంటూ.. తనను పంపించాలని ట్రాఫిక్ పోలీసులతో వాగ్వావాదానికి దిగాడు అప్పటికే పెద్ద ఎత్తున వాహనాలు ఉండటంతో కాసేపు పక్కకు ఉండాలని ట్రాఫిక్ సీఐ సూచించారు. దీంతో అసహనానికి గురైన కార్పొరేటర్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హల్‌చల్ చేశాడు. తీరా చేసేదేమీ లేక పోలీసులు ఆయన్ను పంపించేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఉన్న కార్పొరేటర్.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీలో చేరాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన ఈ కార్పొరేటర్ తీరు తరచూ వివాదాలకు తావిస్తోంది.

హ్యాండ్‌బాల్ విజేత కర్నూలు జట్టు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల విజేతగా కర్నూలు జిల్లా జట్టు నిలిచిందని పోటీల నిర్వాహక కార్యదర్శి డా. రుద్రరెడ్డి తెలిపారు. ఫైనల్స్‌లో వైజాగ్ జిల్లా జట్టుపై కర్నూలు జట్టు 19-16 గోల్స్ తేడాతో గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది. రెండో స్థానంలో వైజాగ్ నిలువగా, మూడో స్థానంలో వెస్ట్ గోదావరి జట్టు, ఈస్ట్ గోదావరి జిల్లా జట్టు సంయుక్తంగా నిలిచాయి. ఈ సందర్భంగా శనివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయకుమార్, ఒలంపిక్ కార్యనిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు వెంకటేశ్, సీనియర్ క్రీడాకారుడు ఫణీంద్రలు హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15-20 తేదీలలో కోల్‌కత్తా వేదికగా జరగబోయే 54వ జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌కు చెందిన ఓ రౌడీషీటర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తిపై ఆ రౌడీషీటర్ బెదిరింపులకు పాల్పడటంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ రౌడీషీటర్‌పై పలు హత్యా, హత్యాయత్నం కేసులు ఉన్నాయి.

12 లోగా అక్రిడిటేషన్లు కోసం నమోదు చేసుకోవాలి

● సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా చైర్మన్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కోసం వెబ్‌సైట్‌లో డిసెంబరు 12లోగా రిజిస్ట్రేషన్, నమోదు ప్రక్రియ పూర్తిచేసుకోవాలని సమాచార పౌర సంబంధాలశాఖ జిల్లా చైర్మన్, కలెక్టర్ రాజకుమారి శనివారం తెలిపారు. 2026- 27 ఏడాదికి సంబంధించి జిల్లాలో అర్హత కలిగిఉన్న వర్కింగ్ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కోసం మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని, మొదట రిజిస్ట్రేషన్ చేసుకొని, తర్వాత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి డాక్యుమెంట్లను, దరఖాస్తు ప్రతిని డీపీఆర్‌వో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

37వ ఈఎన్‌టీ శస్త్ర చికిత్స శిబిరం



వైద్యులకు శిక్షణ ఇస్తున్న డా.జయప్రకాష్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్ఆర్‌పేటలో ఉన్న శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో శనివారం 37వ హ్యాండ్స్ అన్ అసికులో ప్లాస్టీ, టెంపకో ప్లాస్టీ, మైక్రో ఇయర్ సర్జరీల రెండు రోజుల వర్క్‌షాపును ఈఎన్‌టీ స్పెషలిస్టు డా.బి.జయప్రకాష్ రెడ్డి నిర్వహించారు. ఈ వర్క్‌షాపుకు మణిపూర్, ఢిల్లీ, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 20 మంది కొత్త వైద్యులు పాల్గొన్నారు. నూతన వైద్యులకు ఈఎన్‌టీ శస్త్ర చికిత్స నిపుణులు డా.బి.జయప్రకాష్ రెడ్డి, చెవి, ముక్కు సంబంధించిన సూక్ష్మమైన ఎముకలను, ఇతర పరికరాలను సేకరించారు. డా.జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలపై వైద్యులకు శిక్షణకు అందిస్తున్నట్లు తెలిపారు. చెవి, లోపలి భాగంలో ఉన్న సూక్ష్మమైన ఎముకలు వివిద కారణాల వల్ల దెబ్బతిన్నప్పుడు రోగులకు వినికిడి లోపం కలుగుతుందన్నారు.



సెంట్రల్ పోలీస్ ఉద్యోగాలు
25,487 S.S.C-GD కానిస్టేబుల్ ఉద్యోగాలు. అర్హత: 10th పాస్, వయస్సు: 18-28, ఆన్‌లైన్ ప్రారంభమైనది. వ్రాత పరీక్ష : తెలుగు/ ఇంగ్లీష్ ఉంటుంది.స్టార్ కోచింగ్ సెంటర్ నంద్యాల, సెల్: 87908 44959 (Since:1999)
AJL- 258314

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647
AJA- 257599

TO-LET
కర్నూలు to నంద్యాల రోడ్డు బి.తాండ్రపాడు తాలుకా పోలీస్ స్టేషన్ కు అతి దగ్గరలో కిచన్, డైనింగ్ హాలు, 30 రూములు, టాయిలెట్ తో అన్ని వసతులతో కూడిన రన్నింగ్ హాస్టల్ బాడుగకు ఇవ్వబడును. సంప్ర:94402 82624, 94402 94046.
AJL-KNL

కావలెను
ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు కావలెను. అర్హత: ITI ఇంటర్/ డిప్లొమా/ డిగ్రీ (పాస్/ఫెయిల్) విద్యార్థులు పార్ట్‌టైమ్‌గా కూడా చేసుకోవచ్చు వేతనం : కమీషన్ ఆధారంగా. సంప్ర:8977759977, 9618209171
AJA-257570



CHANGE OF NAME
I, ASUMA BEE (Old Name) W/o.HANDRI KAIRAWADI ABDUL KHADER, R/o.H.No: 2-518, B.C.Colony, Gonegandla, Kurnool dist, AP., have Changed my name as HANDRI KAIRAWADI ASMABI HUSEENA BI (New Name) W/o.HANDRI KAIRAWADI ABDUL KHADER
AJL-247790

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న వక్త పుట్టా శేషు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రధాన వక్త పుట్టా శేషు అన్నారు. నంద్యాలలోని పద్మావతి నగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో శనివారం రాత్రి హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన వక్త పుట్టా శేషు మాట్లాడుతూ హిందూత్వ వాతావరణం నిర్మాణం చేయడం, మన దేవాలయ వ్యవస్థను కాపాడుకోవడం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో మనందరి బాధ్యత అన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వక్త హరిబాబు, శ్రీకృష్ణ మందిర నిర్వాహకులు పార్థసారథిక్రిష్ణ, విజయచంద్రుడు, కుంచా మహేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే గిత్త జయసూర్య శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట అల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం

నందికొట్కూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ రఘురామ చార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రబ్బాని గ్రూప్స్ అధినేత హాజీ మహబూబ్ సాహెబ్, కమిషనర్ బేబి పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజులను గుర్తు చేసుకుంటూ గురువులు చూపిన మార్గంలో నడిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. కళాశాలలో నెలకొనే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని మహబూబ్ సాహెబ్ తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్ బాబు, నరేంద్ర, వెంగన్న, చంద్రహాస్, హేమలత పాల్గొన్నారు.

జిల్లా సభల పోస్టర్ ఆవిష్కరణ

నంద్యాల రూరల్ డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) నంద్యాల జిల్లా మూడో మహా సభలను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా నాయక్, ఉపాధ్యక్షుడు డేవిడ్ కోరారు. శనివారం స్థానిక నరసింహయ్య భవనంలో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. జనవరి 9, 10 తేదీల్లో పాములపాడు మండలం సెంటర్‌లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు చెన్నయ్య, కుళాయిస్వామి, తిరుపాలు పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణానికి భూమి పూజ

పాణ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుగాలి మెట్ట, పిన్నాపురం గ్రామాల్లో శనివారం నూతన సచివాలయాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచులు దేవిబాయి, వెంకట కృష్ణ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వరలక్ష్మీ మాట్లాడుతూ రూ. 32 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయాల భవనాలను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల ఇంజనీరు మహబూబ్ బాషా, పంచాయతీ కార్యదర్శులు సోమన్న, ప్రవీణ్, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిరాం కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్


పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతిరాం మెడికల్ కళాశాలలో సైకియాట్రి విభాగంలో పీజీ పూర్తి చేసుకున్న డా. కవితకు కళాశాల యాజమాన్యం బంగారు పతకాన్ని అందజేసింది. 2024నుంచి ఏటా పీజీ విద్యార్థులకు ఉత్తమ విద్యార్థులుగా సైకియాట్రి విభాగాధిపతి డా.పీఎస్ మూర్తి బంగారు పతకాన్ని బహుమతిగా అందజేస్తున్నారు. 2025కి డా.ఎం.కవితకు బంగారు పతకం ప్రదానం చేశారు. ఆర్జీఎం, శాంతిరాం గ్రూప్ ఛైర్మన్ డా.శాంతిరాముడు బంగారు పతకాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ డా.ఎం.మాధవీలత, ప్రిన్సి పాల్ డా.వసంత్ ఆర్.చవాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎం.రఘురాం, ఎం డీ డా.పి. రవిబాబు, మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎ.మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఎంవో డా.కె.నరేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

విళక్కు దీపోత్సవం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడిపాటి గడ్డలో వెలసిన అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో 46వ మండల విళక్కు దీపోత్సవ కార్యక్రమాలు శనివారం రాత్రి ప్రారంభించారు. ముందుగా గోపూజ, గంగపూజ, గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలతో విళక్కు దీపోత్సవం నిర్వహించారు. ఆదివారం ముఖ్యఅతిథుల ఆధ్వర్యంలో హోమాలు, అయ్యప్ప, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి, సాయంత్రం ఆయుధపూజ అనంతరం మూల విరాట్‌కు పుష్పాభిషేకం, సోమవారం కలశయాత్ర, కన్నెస్వాములతో 108 కలశాలతో సింగారి మేళ మేళా వాయిద్యాలతో శోభాయాత్ర, స్వామివారికి విశేష తిరుమంజన సేవ, సాయంత్రం పేటతుళ్లిలతో దీపాలంకరణతో గ్రామోత్సవం, రాత్రి అష్టాదశ కలశాన్విత పడిపూజ మహోత్సవం, ఊంజల్‌సేవ, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు గంగిశెట్టి శ్రీధర్, లయన్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి నైట్ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్న ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు నూర్ తెలిపారు. శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొంటాయని తెలిపారు. గెలుపొందిన జట్లకు తొలి బహుమతిగా రూ.12వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఛైర్మన్ పన్వీలల్‌ మున్నా, ఖోఖో శిక్షకులు మహెబూబ్ తదితరులు ఉన్నారు.

వేగంగా పూర్తి చేయండి


మాట్లాడుతున్న పీడీ హరిగోపాల్

ఆత్మకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ హరిగోపాల్ సూచించారు. శనివారం పట్టణంలో గృహాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ పథకం మంజూరై నేటికీ పూర్తి కాకుండా ఉన్న బేస్ లెవల్, రూఫ్ లెవల్, స్లాబ్ లెవర్ గృహాలకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, చెంచు గిరిజన లబ్ధిదారులకు అదనంగా ఆర్థికసాయం అందజేస్తున్నట్లు వివరించారు. లబ్ధిదారులు 2026 మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈ నాగరాజు, ఆత్మకూరు ఏఈ ఉమామహేశ్వరరెడ్డి ఉన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా
- అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి


నంద్యాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


బండిఆత్మకూరులో..

నంద్యాల టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కమిషనర్ బండి శేషన్న అన్నారు. శనివారం కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీధర్, మున్సిపల్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండి ఆత్మకూరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి సీపీఎం నాయకుడు రత్నమయ్య, వ్యకాస నాయకుడు కుళాయి, డేవిడ్, సుబ్బరాయుడు, సీఐటీయూ నాయకుడు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటసుబ్బన్న పూలమాల వేసి నివాళి అర్పించారు.

పాణ్యం : స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.


ఆత్మకూరులో..

కొత్తపల్లి : మండలంలోని జి. వీరాపురం గ్రామంలో అంబేడ్కర్ యూత్ ప్రెసిడెంట్ జి.మల్లయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ నాగన్న, అబ్రహం, అంకన్న, నాగరాజు, సంజీవరాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రపంచ మేధావుల్లోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి అని ప్రజాసంఘాల నాయకులు మల్లె ఎలీషా, చిలుక రాబిన్‌సన్ రాజు, మురహరి మల్లయ్య, దర్గయ్య, బుజ్జన్న అన్నారు. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న ఉన్నారు.

వెలుగోడు : మండల కేంద్రంలో ఎస్‌డీపీఐ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలల్లో ఎస్‌డీపీఐ నాయకులు బేగ్, ఆరీఫ్, సర్పంచ్ జయపాల్, నాగశేషులు, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.


పాములపాడులో ..


పాణ్యంలో..



వెలుగోడులో..

స్థలాలకు పరిహారం ఇవ్వాలి

- గ్రామస్థుల డిమాండ్


రుద్రవరం గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

పాములపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 340సీలో స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రుద్రవరం గ్రామంలో హైవే అధికారులు, తహసీల్దార్ సుభద్రమ్మ, సీఐ సురేశ్ కుమార్‌రెడ్డి, ఎస్‌ఐల ఆధ్వర్యంలో ప్రొక్లైయిన్‌తో సర్వీస్‌రోడ్డు నిర్మాణానికి అడ్డంకులను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. దాంతో యంత్రాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ నేషనల్ హైవే స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వకుండా గృహాలను తొలగించడం సరికాదన్నారు. ఫ్లైఓవర్‌కు ఇరు వైపులా సమానంగా కొలతలు వేసి సర్వీస్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. కానీ, హైవే అధికారులు ఒకవైపు ఎక్కువభాగం, మరోవైపు తక్కువస్థలం తీసుకోవడం సరికాదన్నారు. అధికారులు సమానంగా కొలతు వేసి న్యాయం చేయాలని అధికారులను కోరారు. దాంతో అధికారులు మాట్లాడుతూ మూడు రోజుల సమయం ఇస్తున్నామని, పరిహారం తీసుకున్నవారు కట్టడాలను తొలగించుకోవాలని, లేదంటే తామే కూల్చేస్తామని హెచ్చరించారు.

పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం గాజులపల్లి జడ్పీ పాఠశాలను డీఈవో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం నేటి నుంచి పది విద్యార్థులకు అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళిక ప్రకారం ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆదివారం కూడా క్లాసులు తీసుకోవాలని తెలిపారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో రామసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను నయం చేసుకోవచ్చు

- బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే శస్త్ర చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ముష్టపల్లి గ్రామంలో సంచార వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహ వ్యాధి గ్రస్థులకు, రక్తపోటు వ్యాధి గ్రస్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఎన్సీడీసీడీ సర్వేలో భాగంగా అనుమానిత క్యాన్సర్ రోగులను పరీక్షించి వ్యాధి నిర్ధారణ కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి కొందరిని రెఫర్ చేసినట్లు తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. రోజువారి ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో పాటు ఊబకాయం తదితర సమస్యల కారణంగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అదే విధంగా పరీక్షలపై అవగాహన రాహిత్యంతో సమస్యల తీవ్రతరమవుతోందన్నారు. ఎన్సీడీసీడీ సర్వేలో భాగంగా క్యాన్సర్ వ్యాధి గ్రస్థులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అమ్మద్‌భాష,ఆరోగ్య కార్యకర్త ఇందిరా ప్రభావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల రూరల్,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని శనివారం పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 18 నెలల గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్నిర్మాణం చేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన జీవో నంబరు 12,14 ను రద్దు చేయాలన్నారు. ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మహ్మద్, రంగనాయకులు, టీవోసీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో శివస్వాముల సందడి


జ్యోతిర్ముడి సమర్పించేందుకు వచ్చిన శివస్వాములు

శ్రీశైలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలంలో శివదీక్షా విరమణలు వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకుని జ్యోతిర్ముడులను సమర్పించేందుకు వేలాదిగా తరలి వస్తున్న శివస్వాములతో క్షేత్ర పుర వీధులలో సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజులు కావడంతో శివస్వాములతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరాధి రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులతో శ్రీగిరిలోని వసతి సముదాయాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దర్శనాలు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పది గంటల నుంచే అన్నప్రసాదాన్ని అందుబాటులో ఉంచుతూ క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అల్పాహారం, పాలు, మంచినీరు అందించారు. కళారాధనలో భాగంగా విజయవాడకు చెందిన లలిత కళా వేదిక బృందం వారు పలు భక్తి గీతాలకు చేసిన కూచుపూడి సంప్రదాయ నృత్యాలు అలరించాయి.


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డాతో ఈవో

దీక్ష విరమణ చేసిన ఎమ్మెల్యే

కార్తీకమాసం మండల దీక్షలు పూర్తి చేసుకుని పౌర్ణమి మరుసటి రోజున మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాల విరమణ చేసుకున్నారు. ఆలయ ప్రధాన గోపురం వద్దకు జ్యోతార్ముడితో ఆయనకు ఈవో శ్రీనివాసరావు ఆలయ సాంప్రదాయం ప్రకారం తిలక ధారణ చేసి ఘనంగా స్వాగతం పలికారు. ఇరుముడి తలపై ఉంచుకుని పంచాక్షరి మంత్రం పఠిస్తూ ఆలయ ప్రదక్షిణలు చేసుకుని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలానంతరం జ్యోతిర్ముడిని సమర్పించారు. ఎమ్మెల్యే వెంట మండల దీక్షలు పూర్తి చేసుకున్న మండల ఇన్‌చార్జి యుగేంధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీనివాసరెడి, శివప్రసాద్ రెడ్డి, శివధర్‌రెడ్డి, ఆంజనేయులు కూడా జ్యోతిర్ముడులు సమర్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

నంద్యాల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాల గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బాల గుర్రప్పను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో గుర్రప్పపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. డ్వామా ఏపీడీ గ్రామంలో విచారించగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో విధుల నుంచి తొలగించామన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి బీరువా విరాళం

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామగట్ల జడ్పీ పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల బీరువాను చాపిరేవుల జడ్పీ పాఠశాల టీచర్ ఎంపీ రమణమ్మ అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితా జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మేరకు టీచర్ తన తల్లిదండ్రుల గోవిందరెడ్డి, పద్మావతమ్మల జ్ఞాపకార్థం బీరువాను అందజేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోహనరావు, వెంకటేశ్వర్లు, శైలజ,ఆదిలక్ష్మి,విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గోస్పాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం హెడ్‌కానిస్టేబుళ్లు ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీ సూచించారు. శనివారం మండలంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. శక్తియాప్‌ను ఏ విధంగా వాడుకోవాలి.. బాల్య వివాహాలపై ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైం, చైల్డ్ మిస్సింగ్, 112నెంబర్‌పై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయాలి

- రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

నంద్యాల రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న నంద్యాలలో నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. శనివారం స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఏడు నియోజకవర్గాల నుంచి రజక మహిళలు, సోదరులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మండలా వారిగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నాయకులు నాగరాజు, వేంకటేశ్వర్లు, శ్రీనివాసులు గోవిందు పాల్గొన్నారు.

పీ4 కింద రెండు కుటుంబాలు దత్తత

- ఎంపీడీవో మేరీ

కొత్తపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 బంగారు కుటుంబాల మార్గదర్శి కింద ఎలాంటి జీవనాధారం లేని రెండు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి ముందుకు వచ్చారని ఎంపీడీవో మేరీ తెలిపారు. శనివారం మండలంలోని కొకెరంచ గ్రామంలో పీ-4 బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బారావు, పలువురు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతిరాం హాస్పిటల్ డైరెక్టర్ రఘురాం పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఎస్పార్బీసీలో ఉన్న పరివర్తన లైఫ్ సెంటర్‌లోని అనాథ పిల్లలకు, ఎయిడ్స్ బాధిత పిల్లలకు గిరిజన ప్రజాసమాఖ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పిల్లలతో కలిసి కేక్ కట్‌చేశారు. రాజునాయక్ మాట్లాడుతూ గిరిజనులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న శాంతిరాం ఆస్పత్రి డైరెక్టర్ రఘురాంను అభినందించారు. తండా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి బస్సు సౌకర్యం కల్పించి చికిత్స అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రవినాయక్, రవీంద్రనాయక్, నగేష్‌నాయక్, నాగరాజునాయక్, స్వామినాయక్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విజయరావు మృతి


విజయరావు (ఫైల్)

పాణ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విజయ్ టైపు ఇన్‌స్టిట్యూషన్ యజమాని ఆల్వకొండ విజయరావు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయరావు శుక్రవారం అపస్మారకస్థితిలోకి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని గ్రామస్థులు, ఇతరప్రాంతాల ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. పాణ్యం మండలంలో 1980లో జిరాక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఎంతో మంది విద్యావంతులకు, నిరుద్యోగులకు టైపు శిక్షణద్వారా ఉపాధి కల్పించి, మానవత సేవా సమితి కార్యదర్శిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేసుకున్నారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఊరేగింపుగా మృతదేహాన్ని తరలించి నంద్యాల క్రిస్టియన్ అసెంబ్లీ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, మాజీ ఉపసర్పంచ్ రమణమూరి, టీడీపీ నాయకులు ఖాదర్‌భాష, లాయర్ బాబు, జాతీయ క్రీడాకారుడు, మానవత అధ్యక్షులు, ఏఎస్ఐ గోపి, మాజీ ఆర్ఐ జేమ్స్, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పని వేళలు పాటించాలి

మహానంది, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ ఎంపీడీవో సంజీవకుమార్ ఆదేశించారు. శనివారం తమ్మడపల్లి గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పరిపాలన పరంగా సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమాంజలి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడుల

ఆత్మకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో గుండెపోటు లక్ష్మమ్మ, వీరవెల్లి రుక్మిణమ్మ అనే ఇద్దరు మహిళలు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇరిగెల మోహన్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సమాజ సేవకు వినియోగించాలి

శ్రీశైలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంపాదనలో కొంత సమాజ సేవకు వినియోగించాలని ప్రొఫెసర్ శ్రీనివాసరావు అన్నారు. శ్రీశైలంలో పేద చెంచు మహిళలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమరంభీం సంఘం అధ్యక్షుడు ఆశీర్వాదం, అంకన్న, వీరయ్య యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థాన వైద్యశాలకు మందుల విరాళం


వైద్యశాలలో మందులు విరాళం ఇస్తున్న దాతలు

శ్రీశైలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వైద్యశాలకు హైదరాబాద్‌కు చెందిన రాజు గౌడ్, సంధ్య మందులను విరాళంగా అందజేశారు. శనివారం సుమారు రూ. లక్ష ఇరవై నాలుగు వేల విలువగల మందులను ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావుకు ఇచ్చారు. పలురకాల నొప్పులు, జర్వం, బలహీనత, షుగర్, బీపీ, ఎముకల బలానికి సంబంధించిన మందులను ఇచ్చినట్లు దాతలు తెలిపారు. ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న దేవస్థానంలో తాము కూడా భాగస్వాములం కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

హోటల్ యజమానికి జరిమానా



హోటల్ సిబ్బందికి జరిమానా విధిస్తున్న పంచాయితీ సిబ్బంది

బనగానపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ వాడుతున్న యజమానికి శనివారం బనగానపల్లె గ్రామ పంచాయతీ సిబ్బంది జరిమానా విధించారు. కొత్తబస్టాండ్ సమీపంలోని సీతామహాలక్ష్మి టిఫిన్ హోటల్‌లో ప్లాస్టిక్ వాడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని హోటల్ యజమానికి జరిమానా విధించారు.

వీధి దీపాల ఏర్పాటు



లైట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

కొలిమిగుండ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలోని లక్ష్మీనగర్‌లో రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం నూతన వీధిలైట్లను ఏర్పాటు చేశారు. శనివారం డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్, సర్పంచ్ శివ రాముడు, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు డైరక్టర్ మందా విజయ్, పంచాయితీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ కాలనీని సందర్శించి నూతన వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. దీంతో ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల వసతి గృహం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి మునిరాజు

డోన్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజోతి): పట్టణంలోని పాతపేటలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని డోన్ డివిజన్ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి మునిరాజు శనివారం తనిఖీచేశారు. వసతి గృహంలో అందు తున్న సదుపా యాలు, అమలవుతున్న మెనూ గురించి బాలికలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బాలికల వసతి గృహం వార్డెన్ వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

నాబార్డ్ సేవలు అభినందనీయం

ప్యాపిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నాబార్డ్ సేవలు అభినందనీయమని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కలచట్ల గ్రామంలో నాబార్డ్ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై పైపులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నాబార్డ్ అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీర్ రాకేష్, వాటర్ షెడ్డు కమిటీ నాయకులు రాజా, రవి, రైతులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి : మున్సిపల్ చైర్మన్

డోన్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బేతంచెర్ల నుంచి కొత్తబుగ్గ సమీపంలో జరుగుతున్న డోన్ జాతీయ రహదారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చే యాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శనివారం జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేష్ డోన్ మున్సిపాలిటీకి రూ.1.5 కోట్లతో 6లక్షల లీటర్ల కెపాసిటీతో కొత్తగా కడుతున్న పంప్ హౌస్ పనులను పూర్తిచేసి ప్రజలకు నీటికి ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

వాట్సాప్ సేవలపై అవగాహన

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో వాట్సాప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, వార్డు, సచివాలయ ఉద్యోగుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కౌసల్యం, మన మిత్ర, తల్లికి వందనం, ఈకేవైసీ, బయోమెట్రిక్, చైల్డ్ ఆధార్ పలు అంశాలపై జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని తెలిపారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి, మండల సర్వేయర్ దేవరాజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి



వినతి పత్రం ఇస్తున్న సహకార సంఘం ఉద్యోగులు

బనగానపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డిమాండ్లను పరిష్కరించి ఆదుకోవాలని బనగానపల్లె సహకార సంఘం ఉద్యోగులు కోరారు. శనివారం బనగానపల్లె కేడీసీసీ బ్రాంచ్ మేనేజరు బ్రహ్మానందారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర సహకార సంఘం ఉద్యోగుల కార్యదర్శి మునాఫ్ ఆధ్వర్యంలో తమ డిమాండ్లు నెరవేర్చాలని సమ్మె నోటీసును అందించారు. జీవో నంబరు 36ను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాల సవరణ చేయాలని, చట్ట ప్రకారం గ్రాట్యుటీ, మధ్యంతర భృతి చెల్లించాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శత్రఘ్నుడు, సీఈవోలు దస్తగిరి, ఘనమద్దిలేటి, ఏఈవోలు షామీర్, శివారెడ్డి, మహేంద్రారెడ్డి, సురేంద్రనాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, అమీన్, హుసేన్‌వలి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు కాలనీకి చెందిన ఫరూక్ అనే పేద కుటుంబానికి రూ.10 వేలు నగదును దాత చక్రం షబ్బీర్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాదర్‌బాష, షఫీ, నూర్‌బాష, చాంద్‌బాష, మాబుహుసేన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర మాజీ మంత్రి బుగ్గన

బేతంచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) :రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ మంత్రి బుగ్గన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ దేశ రాజ్యాంగ నిర్మాత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహానుభావుడు డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ అని ఆయన సేవలను కొనియాడారు.

ప్యాపిలి : అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ ఎస్టీ సెల్ అధికారి ప్రతినిధి మధుకుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ దగ్గర అంబేడ్కర్ 69వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్‌సీ మద్దిలేటి, బాలరంగన్న, రంగన్న, నాగేశ్వరరావు, శేఖర్, ఓబులేసు పాల్గొన్నారు.

బేతంచర్ల: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కోట్ల గోరంట్ల, చిన్న సుబ్బయ్య, రామసుబ్బయ్య, మునిస్వామి, జార్జి, గోర్లగుంట రామసుబ్బయ్య, దళిత సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవెలకుంట్ల: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బోధనం బాలనాగన్న పేర్కొన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బోధనం బాలనాగన్న, వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి పట్టణంలోని ప్రధాన రహదారిలో జమ్ములమడుగు సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, కరీంబాషా, ఓబయ్య, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దామని ఆర్‌పీఐ రాష్ట్ర నాయకుడు హుస్సేనప్ప, భూమా నాగన్న, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజుగౌడు అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం డోన్ మండల కార్యదర్శి గోసానిపల్లి తెలుగు రాంబాబు, ఎర్రగుంట్ల ఆల శ్రీరాములు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని అవుకు మెట్ట వద్ద అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు మాలమహానాడు రాష్ట్రకార్యదర్శి దస్తగిరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మారం నాగరాజు, మద్దిలేటి, శివుడు, కొత్తపేట నరసింహుడు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ప్రపంచ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య పూలమాలలు వేసి నివాళిర్పించారు. కార్యక్రమంలో పెద్ద మునెయ్య, ప్రతాప్, బద్రునాయక్, ఎర్రన్న, కంబగిరిస్వామి, రామకృష్ణ, మద్దిలేటి, బెలుం నాగన్న దస్తగిరి, వెంకటసుబ్బయ్య, బాలదస్తగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని మెట్టుపల్లె గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దేవరత్నం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, సుబ్బయ్య, కంబగిరి పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని అవుకు మెట్ట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శివనారాయణ, కడియాల జయరాముడు తదితరులు నివాళులర్పించారు. చిన్నమునెయ్య, మాలనాగన్న, శ్రీను, రాయుడు, యాగంటిపల్లె పెద్ద పక్కీర, తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలోని అంబేడ్కర్ భవనంలో వర్ధంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అధికారి ప్రతినిధి కంబగిరిస్వామి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

● బెలుం గ్రామంలో దళిత సంఘం నాయకులు అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, చెన్నయ్య, రాజారాం, పృథ్వీ, ప్రదీప్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మేగా ప్రతాప్, హరినారాయణ, గణమద్దిలేటి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీను, బాల ఓబన్న, శివ, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నేగల జాని, ఆర్‌ఎస్‌పీ కన్వీనర్ కళ్యాణ్ కోరారు. శనివారం పట్టణంలోని చింతకుంట రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, బీసీ, ముస్లిం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అవుకు మెట్ట వద్ద నివాళి



బనగానపల్లెలో ..



అవుకులో..



బెలుం గ్రామంలో నివాళి



ప్యాపిలిలో..



కొవెలకుంట్లలో..



చాగలమర్రిలో..



ఆళ్లగడ్డలో..

అక్రమ నిర్మాణాలను ఖాళీ చేయాలి

డాక్యుమెంట్ రైటర్లకు ఎంపీడీవో నోటీసులు

ఆళ్లగడ్డ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఏర్పాటు చేసుకున్న రేకు షెడ్లను ఖాళీ చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నూర్జుహాన్ శనివారం నోటీసులు జారీ చేశారు. దాంతో డాక్యుమెంట్ రైటర్లలో కలకలం మొదలైంది. ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 2021లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి చింతకుంట రహదారిలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోకి మార్చారు. డాక్యుమెంట్ రైటర్ల కూడా అనధికారికంగా రేకుల షెడ్లు వేసుకొని కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే వారం రోజులు క్రితం ఇద్దరి డాక్యుమెంట్ రైటర్ మధ్య బేదాభ్రాయాలు వచ్చాయి. ఇది కాస్త రాజకీయ రంగు పులుముకుంది. ఈ వ్యవహారం అధికారులకు తల నొప్పిగా మారింది. శనివారం ఎంపీడీవో నూర్జహాన్ స్వయంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులతో చర్చించారు. తమ కార్యాలయంలో వేసిన షెడ్లను వెంటనే తొలగించాలని స్టాంప్ వెండర్లకు, దస్తావేజు రైటర్లకు నోటీసులు జారీ చేశారు.



కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్స్ ఏర్పాటు చేసుకొన్న షెడ్లు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జిల్లా బాలుర సంరక్షణ అధికారి సునంద కుమారి

కొలిమిగుండ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని జిల్లా బాలుర సంరక్షన అధికారి సునందకుమారి పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై కొలిమిగుండ్ల కేజీబీవీలో శనివారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల రహిత ఏపీ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మి సరోజ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మెగా కంటి వైద్య శిబిరం

కోవెలకుంట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో సోమవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. కర్ర సుబ్బారెడ్డి ఫౌండేషన్,మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రికి చెందిన వైద్య బృందం పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ మెగా వైద్య శిబిరం పట్టణంలోని పాత సంస్కృత పాఠశాల ఆవరణలో ఉన్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించన్నుట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్వకొండ క్రాస్ రోడ్ వద్ద వెలిసిన కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు శనివారం ముగిశాయి. ఆశ్రమంలో వెలిసిన కాశిరెడ్డినాయన లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చెక్కభజన, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు హాజరైన భక్తులందరికీ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు రమణయ్య, మల్లికార్జున రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాల పనులు వేగవంతం చేయాలని ఆళ్లగడ్డ హౌసింగ్ డీఈ విజయబాబు తెలిపారు. చాగలమర్రి గ్రామంలోని ఎస్సీ కాలనీలో లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న గృహాలను మార్చి చివరి నాటికి పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నవీన్, వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు.

బాలికల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవో న్యామతుల్ల తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో బాలికల కోసం ఏర్పాటు చేసిన పాల ల్యాబ్‌ను పరిశీలించారు. పాతబస్టాండులోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల గ్రేడింగ్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ స్వప్న పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

బేతంచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన షేక్ నబిరసూల్ అనే యువకుడు అదృశ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ శనివారం తెలిపారు. వివరాలు.. సంజీవనగర్‌కు చెందిన మహమ్మద్ హుస్సేన్ కుమారుడు షేక్ నబిరసూల్ ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. సమీప బంధువులను వాకబు చేసిన ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మరో మహిళ..

నాపరాళ్ల పరిశ్రమలో పనిచేస్తున్న కుమారుని కలిసేందుకు వచ్చిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని డోన్ రహదారిలో ఉన్న ప్రసాద్ నాపరాళ్ల ఫ్యాక్టరలో గుంత సుధాకర్ పనిచేస్తున్నాడు. అతని తల్లి గుంత కదిరమ్మ తుగ్గలి మండలం జొన్నగిరి నుంచి గత నెల 20న కొడుకు వచ్చేందుకు వచ్చింది. కుమారుడిని కలిసి ఫ్యాక్టరీ నుంచి కొడుకు ఇంటికి వెళ్తానని చెప్పి బయలుదేరింది. ఇంతకీ రాలేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. శనివారం కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బేతంచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కొట్టాల శివశంకర్(29) అనే యువకుడు కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. వివరాలు.. శివశంకర్ తండ్రి సత్యానారాయణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ 3లక్షలు అప్పు చేశాడు. అప్పుల వేధింపులు తాళలేక ఈనెల 1న ముచ్చట్ల దేవాలయం సమీపంలో పురుగుమందు తాగాడు. అతనిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందగా , కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం



మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకులు

చాగలమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డోన్ మాజీ మండల కన్వీనర్, పరిశీలకులు ఎస్. శ్రీనివాస్, రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలో బూత్ కన్వీనర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికల ఫలితాల్లో ఆయా గ్రామాల్లో బూత్ వారిగా మెజార్టీ రాని బూత్‌లను పరిశీలించి ఓట్లు తక్కువగా రావడానికి గల కారణాలను పరిశీలించామన్నారు. టీడీపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బూత్ కన్వీనర్లకు సూచించామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించుకునేందుకు కృషి చేయాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ నరసింహారెడ్డి, బేతంచర్ల టీడీపీ నాయకులు షేక్షావలి, చౌదరి, చాగలమర్రి మండల టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, గాంధీ, దస్తగిరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మండల సమావేశంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్

రుద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దారు థోనీ ఆల్‌ఫ్రెడ్ మాట్లాడుతూ మండలంలో 39చౌక దుకాణాల పరిధిలో రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహిస్తున్నామన్నారు. మండలానికి రైస్‌కార్డులు 15269 మంజూరు కాగా 11176 పంపిణీ చేశామన్నారు. పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ సుబ్రమణ్యం, ఏపీయం వసంతకుమారి, ఏవో సుమతి, ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ కమాల్‌సాబ్ ప్రగతి నివేదికలు చదివివినిపించారు. సమావేశంలో ఎంఈవో వీరరాఘవయ్య, డిప్యూటీ ఎండీవోలు సుబ్రమణ్యం, ప్రసాదరెడ్డి, ఈసీ సుబ్బన్న, హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్లు ఆనంద్, ప్రసాద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్లాట్లు ఎక్కడ వేశాం

టీడీపీ నేతలకు మాజీ మంత్రి బుగ్గన ప్రశ్న

బేతంచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ప్లాట్లు వేశామని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారని, ఆ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో చూపించాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రశ్నించారు. శనివారం ఉదయం శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు టీడీపీ నాయకులు తమపై అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. శేషారెడ్డి పాఠశాల ప్రాంగణంలో ఎక్కడ ప్లాట్లు లేవని, ఎక్కడైనా ఉంటే చూపించగలరా? అని ప్రశ్నించారు. పట్టణంలోని పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు మార్నింగ్ వాక్ చేసుకోవడానికి అనుకూలంగా ఉన్న పాఠశాలలో ప్లాట్లు ఎలా వేస్తారన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో డోన్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు ఇలాంటి చౌకబారు ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయితీ చైర్మన్ చలం రెడ్డి, వైసీపీ కన్వీనర్ తిరుమలేష్ రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతరామ చంద్రుడు, నాయకులు మూర్తుజావలి, వైసీపీ మండల నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నగర పంచాయితీ కన్వీనర్ పిట్టల జాకీర్, వార్డ్ కౌన్సిలర్ నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బీసీ నాయకులు మురళీకృష్ణ, అధిక సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

డోన్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజోతి): గ్రామాభివృద్ధే లక్ష్యమని వెంకట నాయునిపల్లె సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. శనివారం గ్రామంలోని సచివాలయ కార్యాలయంలో పాలకవర్గం సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రా మంలో తాగునీరు, వీదిలైట్లు, పారిశుద్యం అంశాలపై పాలకవర్గ సభ్యులతో సర్పంచ్ చర్చించారు. గ్రామ కార్యదర్శి వెంకటరమణయ్య, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.